

ఒపి ధరల సూచిక బోర్డులు తప్పనిసరి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులలో తప్పనిసరిగా ఒపి ధరల సూచిక బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కెవెంకటేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. కేసు పట్టు- కమీషన్ కొట్టు అనే శీర్షికతో ప్రజాశక్తిలో ఈ నెల 4న కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనంపై డిఎంహెచ్ఒ స్పందించారు. రోగికి చికిత్స, మందులు, లాబ్ ఛార్జీలు, గదిఅద్దె మొదలైనవి బిల్ రూపంలోఇవ్వాలని ఆస్పత్రుల యాజమాన్యాలకు ఇప్పటికే తెలియజేశామని పేర్కొన్నారు. అదే విధంగా రోగులను రిఫర్ చేసి కమీషన్లు తీసుకోవడం చట్టవిరుద్ధమని, ఇలాంటి వ్యవహారాలు నిర్ధారణ అయితే సంబంధిత ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అవసరమైతే అనుమతులు సైతం రద్దు చేస్తామని తెలిపారు.

పడవ కార్మికుల ఆకలి కేకలు

- 20 రోజులుగా ఇసుక ర్యాంపుల మూత
- పదివేల మంది కార్మికుల ఉపాధికి గండి
- వరదతో నిలిచిన ఇసుక తవ్వకాలు



కొవ్వూరు మండలం వాడపల్లి లో వెలవెలబోతున్న ఇసుక ర్యాంపు

ప్రజాశక్తి -కొవ్వూరు

గోదావరిలో వరద పోటెత్తడంతో పడవ కార్మికుల ఉపాధికి గండి పడింది. సుమారు మూడు వారాల నుంచి ఇసుక తవ్వకం పనులు నిలిచిపోవడంతో కార్మికులు ఉపాధి లేక అల్లాడుతున్నారు. జిల్లాలో పడవల సాయంతో నడిచే ఇసుక ర్యాంపుల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు పదివేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ర్యాంపులు మూతపడి 20 రోజులు కావస్తుండడంతో పడవ కార్మికులు ఉపాధి కరువై తీవ్ర ఇబ్బందులను చవిచూస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నదిలో ప్రవాహ జలాల ప్రభావం తగ్గుముఖం పట్టడంతో ఇసుక ర్యాంపులు తెరిపించాలని కార్మికులు వేడుకుంటున్నారు. పడవ కార్మికులతో పాటు పొక్లెయిన్ డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, పడవల నిర్వాహకులు, ఫైబర్ పనులు చేసుకునే కార్మికులు, లోడింగ్ ట్రాక్టర్ డ్రైవర్లు, కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది.

వినియోగదారులకు పడవల ఇసుక మక్కువ

పడవల సాయంతో సేకరించే ఇసుక నాణ్యతగా ఉంటుంది. దీంతో ఎక్కువ మంది నిర్మాణ పనులు చేపట్టే వారు అధికంగా పడవల ఇసుక వినియోగించడానికే ఇష్టపడతారు. పడవల సాయంతో నడిచే ర్యాంపుల్లో ప్లాస్టిక్ అవసరమైన మెత్తని ఇసుకతో పాటు, కాంక్రీట్ పనులకు వినియోగించే వరకు ఇసుక, ఇతర పనులకు వాడే మీడియం ఇసుక అందుబాటులో ఉంటుంది. అవసరమైన క్వాలిటీ ఇసుకను లబ్ధిదారులు తీసుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వర్షాకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారీగా స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ లభ్యమయ్యే ఇసుక ఒకే రకమైన, లేదంటే అన్ని రకాలు కలిసినా ఇసుక మాత్రమే లభ్యమవుతుంది. దీంతో వినియోగదారులు పడవల సాయంతో సేకరించిన ఇసుక వినియోగించడానికి అధికంగా మక్కువ చూపిస్తుంటారు. స్టాక్ పాయింట్లలో ఎంత ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ వినియోగదారులు మాత్రం పడవల సాయంతో సేకరించిన ఇసుక పట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. భవన నిర్మాణ కార్మికుల ఉపాధిపైన పడే అవకాశం ఉంది.

ఇతర రాష్ట్రాల కూలీలపైన ప్రభావం

స్థానిక కార్మికులతో పాటు చత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కూలీల సాయంతో నడిచే ఇసుక ర్యాంపుల్లో పనుల నిమిత్తం ఏటా ఈ ప్రాంతానికి వలస వస్తారు. ప్రస్తుతం ఇసుక తవ్వకం పనులు నిలిచిపోవడంతో సుమారు 20 రోజుల నుంచి ఇక్కడే ఉపాధి కోసం పడిగాపులు పడుతున్నారు. ఇప్పటికే కొన్ని ముఠాలు పనులు లేక స్వస్థలాలకు వెళ్లిపోయారు. జిల్లావ్యాప్తంగా సుమారు 800 పడవల వరకు ఉంటాయి. ఒక్కో పడవపై పది నుంచి 12 మంది వరకు ఉపాధి పొందుతారు. వీరందరి ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది.

వ్యాపారులపైనా ప్రభావం

ర్యాంపులు నడవడం మూలంగా పరిసర ప్రాంతాల్లో ఉండే హోటళ్లు, కిరాణా, రైస్, కూరగాయలు వంటి దుకాణాలకు డిమాండ్ ఉంటుంది. పడవలు ఉండడంతో వాటి మరమ్మతుల నిమిత్తం మెకానిక్‌లు, ఫైబర్ వర్కర్లు, ఆటోమొబైల్ దుకాణాలు, ఫైబర్ సామాన్లు, ఇంజన్లు విక్రయించే దుకాణాలు, పడవ సామగ్రి అమ్మే దుకాణాలకు వ్యాపారం సాగుతుంది. మూడు వారాల నుంచి పడవలు నడవకపోవడంతో వీరందరి ఉపాధిపైన ప్రభావం పడింది.

తగ్గుముఖం పట్టిన గోదావరి వరద

గోదావరిలో వరద గత రెండు రోజుల నుంచి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి ప్రవాహ జలాలు తక్కువగా రావడంతో ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుతం ధవళేశ్వరం ఆనకట్ట వద్ద ఉదయం 11 గంటలకు నీటిమట్టం 10.20 అడుగులుగా నమోదయింది. ఆనకట్ట నుంచి 8,06,068 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. ఆదివారం సాయంత్రానికి వరద సాధారణ స్థితికి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ట్రంప్ సుంకాలు రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, కొవ్వూరు

ఆక్వా తదితర రంగాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని కోరుతూ శనివారం ఉదయం స్థానిక శ్యామల సెంటర్ వద్ద సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ రెండు న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ట్రంప్, ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనను ఉద్దేశించి వామపక్ష నాయకులు టి.అరుణ్, టి.మధు, చీకట్ల వెంకటేశ్వరావు మాట్లాడారు. అమెరికా నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల ధరలు గణనీయంగా పడిపోవడంతో తీరప్రాంత రైతులు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడ్డారని, గార్మెంట్స్ మిల్లులు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న వేలాది మహిళా కార్మికుల ఉపాధి ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రజల ప్రయోజనాల కంటే అమెరికా ప్రయోజనాలను కాపాడటంలో ఆసక్తి చూపుతున్నారని, ఇది అత్యంత దురదష్టకరమన్నారు. అమెరికా వీసా నిబంధనల కఠినతరం భారత విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతోందని తెలిపారు. రైతులు, కార్మికులు నష్టపోతున్నా కేంద్ర ప్రభుత్వానికి కనీసం ఆవేదన కనిపించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ సర్కారు మౌనం గర్హనీయమని వామపక్ష నాయకులు తీవ్రంగా విమర్శించారు. భారతదేశ వాణిజ్య ఎగుమతి, దిగుమతులపై ట్రంప్ విధించిన సుంకాల టారిఫ్‌లను తక్షణమే రద్దుచేయాలని, అమెరికా ఆంక్షల పట్ల మోడీ ఉదాసీన వైఖరి విడనాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టిఎస్.ప్రకాష్, బి.పవన్, ఎస్ఎస్.మూర్తి, కర్రి రామకృష్ణ, బి.పూర్ణిమరాజు, వి.కొండలరావు, పి.లావణ్య, సప్పా రమణ, జె.సత్తిబాబు, కె.కిరణ్ కుమార్, టి.నాగేశ్వరావు, పి.త్రిమూర్తులు, కె.శ్రీనివాస్, ఎస్.నౌరోజీ, నల్లా రామారావు, పి.దేముడుబాబు, సుందర్ బాబు, రెడ్డి రమణ, ఎపిసిఎల్‌సి అధ్యక్షుడు రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు పట్టణంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలను వెంటనే ఎత్తివేయాలని శనివారం ఆందోళన నిర్వహించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడారు. పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఈమని మల్లిక, ఐఎఫ్‌టియు నాయకులు బాబి, రామకృష్ణ, కోటిచుక్కల రాము, భూషణం, నాగేశ్వరరావు రాజశేఖర్ పాల్గొన్నారు.

భూముల ఆక్రమణపై చర్యలకు సిఫార్సు

ప్రజాశక్తి - సీతానగరం

మునికుడలిలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు మండల డిప్యూటీ సర్వేయర్, పంచాయతీ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 232-1ఎ2 లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు తేలింది. ఈ ఆక్రమణల వల్ల ఎస్‌డబ్ల్యూఎల్ఎ ల్యాండ్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు నివేదించారు. అధికారులు జరిపిన సర్వేలో భాగంగా రోడ్డు వైపుకు జరిగిన ఆక్రమణలను గుర్తించారు. తూర్పు వైపు 10 లింకులు, పడమర సిసి రోడ్డు వైపు 5 లింకులు, పడమర గోడకు దక్షిణం వైపు మరో 5 లింకులు స్థలం అక్రమంగా ఆక్రమించబడినట్టు సర్వేయర్లు గుర్తించారు. వీటిపై తదుపరి చర్యలు తీసుకోవాలని మండల్ డిప్యూటీ సర్వేయర్, అధికారులు నివేదికలో సిఫార్సు చేశారు. ఈ నివేదికను స్థానిక అధికారులకు అందజేయడంతో అక్రమార్కులపై చర్యలు తీసుకుని కట్టిన ప్రహరీ గోడను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రావూరుపాడులో భారీ వర్షం..

ప్రజాశక్తి-తాళ్లపూడి

చిన్నపాటి చినుకు పడితేనే వీధులన్నీ జలమయమై చెరువులను తలపిస్తున్నాయని పెద్దేవం శివారు రావూరుపాడు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం సాయంత్రం రావూరుపాడు పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షం కారణంగా గ్రామంలోని ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. దీనికి ప్రధాన కారణం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమేనని గ్రామస్తులు అంటున్నారు. తమ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ తదితర సమస్యలను కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్టు ఎఎంసి వైస్ చైర్‌పర్సన్ రేకపల్లి మంగమణి ముత్యాలరావు తెలిపారు.



రావూరుపాడులో భారీ వర్షంతో రోడ్డు దుస్థితి

పౌల్ట్రీ కోళ్లు మరణిస్తే సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి-గోపాలపురం

వివిధ కారణాల వల్ల పౌల్ట్రీ కోళ్లు అధిక శాతంలో మృత్యువాత పడుతున్నాయని, దీనిపై వెంటనే సమాచారం ఇవ్వాలని జిల్లా పశుసంవర్ధక అధికారి టి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పటికప్పుడు పశు సంవర్ధక శాఖ తరచుగా జారీ చేసే సూచనలను పౌల్ట్రీ రంగంలో వారు తప్పనిసరిగా పాటించాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా పెద్ద సంఖ్యలో కోళ్లు మృతి చెందితే, సమీప పశుసంవర్ధక శాఖ సిబ్బందికి తెలియ చేయాలని కోరారు. ఆయన సూచించారు. ఈ సమాచారాన్ని పశుసంవర్ధక శాఖ కార్యాలయ కాల్ సెంటర్ 8834058087కు తక్షణమే సమాచారం ఇవ్వాలని సూచించారు.



బ్యారేజీని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

బ్యారేజ్ మరమ్మతులు ప్రారంభం

ప్రజాశక్తి-కొవ్వూరు


కొవ్వూరు మండలం సీతంపేటలోని విజ్జేశ్వరం కెనాల్ బారేజ్ గేట్లు ఎమర్జెన్సీ రిపేర్లు పనులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. రూ.7.50 లక్షల నిధులతో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎంపిపి కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, గ్రామ సర్పంచ్ బంగారయ్య, ఎఇ సునీల్ కుమార్, జనసేన మండల అధ్యక్షుడు సుంకర సత్తిబాబు, బేతిన నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కంటిలో దృష్టి దోషాల నివారణకు నేత్ర పరీక్షలను జరుపుకోవాలని జిల్లానేత్ర వైద్యాధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా నేత్ర వైద్య అధికారుల బృందం శనివారం స్థానిక దానవాయిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దృష్టి లోపాలను గుర్తించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంధత్వ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎ విటమిన్ లోపం వల్ల కంటికి అంధత్వం వస్తుందని, దీని నివారణకు పచ్చని ఆకుకూరలు, క్యారెట్, బీట్‌రూట్ ఆహారంలో అధికంగా తినాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.రవి కుమార్, ప్రసన్న కుమార్, రాజాఖాన్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



- ఆర్ఎంపి, పిఎంపిల తీరు
- ఆసుపత్రులకు సిఫార్సులు
- 30 శాతం కమీషన్ వసూలు

కుల వివక్షకు గురైతే అండగా ఎస్‌సి కమిషన్

ప్రజాశక్తి-తాళ్లపూడి

కుల వివక్షకు గురైన బాధితులకు అండగా ఉంటూ న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్‌సి కమిషన్ అన్ని సమయాల్లోనూ బాధితులకు అండగా ఉంటుందని కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్ అన్నారు. శనివారం తాళ్లపూడి వచ్చిన జవహర్ బిసి నాయకుడు, గ్రామ సర్పంచ్ నక్కా అనురాధ భర్త చిట్టిబాబు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ కుల వివక్షకు గురైన బాధితులు ధైర్యంగా ఎస్‌సి కమిషన్ సాయం పొందవచ్చని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో కమిషన్ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అన్ని వర్గాలతో పాటు ఎస్‌సి, ఎస్‌టిలకు అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలను వివక్ష లేకుండా అమలు అయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రజలకు చట్టంపై అవగాహన పెరిగిందని, తన వద్దకు వచ్చిన 150 కేసులు పరిష్కార దిశలో ఉన్నాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలు ప్రశాంతంగా ఉండేలా కమిషన్ రక్షణ కల్పిస్తోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసులు వచ్చినప్పుడు తప్పనిసరిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని, కేసులో నిజాలు లేకుంటే ఫిర్యాదుదారులతో మాట్లాడి సెటిల్ చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. జవహర్ వెంట మండల నాయకులు ఆత్కూరి రాంబాబు, బోడపాటి కాశి, నామ సురేంద్ర తదితరులు ఉన్నారు.



తాళ్లపూడి వచ్చిన ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-తాళ్లపూడి



నల్ల బ్యాడ్జీలతో సచివాలయ సిబ్బంది నిరసన

వివిధ సర్వేల పేరుతో ప్రభుత్వం అధిక పని భారాన్ని వేసిన కారణంగా రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు మండలంలోని సచివాలయ ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వం అధిక పని భారాన్ని వేయడం వల్ల తమ విధులకు ఆటంకం కలుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వాలంటీర్లు పనులు, ఇంటింటి సర్వే కార్యక్రమాలు తమనే చేయాలని ఆదేశించడం సరికాదన్నారు. సచివాలయ ఉద్యోగుల ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ 750 ప్రభుత్వ సేవలు ప్రజలు వినియోగించుకునేలా ప్రతి వ్యక్తినీ కలవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

జెసిని కలిసిన అడిషనల్ కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై.మేఘస్వరూప్‌ను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పోషక విలువ కలిగిన ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆహారం భుజిస్తేనే పూర్తి ఆరోగ్యం చేకూరుతుందని, పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందని అర్బన్ రేంజ్ డిఐబి దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. ఎక్కువ పోషక విలువలతో కూడిన వంట చేసిన తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ప్రభావతి, పాఠశాల హెచ్ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం, మ్యాజిక్ బస్సు ప్రతినిధి స్వాతి, టిఎంఒ జి.ప్రియాంక, వార్డ్ ఇన్‌ఛార్జి గిరిజ, ఎఎన్ఎం ఆశ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైసిపి పోరుబాట

ప్రజాశక్తి -కొవ్వూరు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తలారి వెంకట్రావు

కూటమి ప్రభుత్వంలో రైతులు ఇప్పటివరకు అమ్ముకోవడంలో ఇబ్బందులు పడితే, నేడు యూరియా దొరక్క పడరాని పాట్లు పడుతున్నారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు విమర్శించారు. కొవ్వూరులోని వైసిపి కార్యాలయం వద్ద అన్నదాత పోరుబాట పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఈ నెల 9న నిర్వహించే అన్నదాత పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. యూరియా దొరక్క రైతులు పిఎసిఎస్ వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.270 ఉన్న యూరియా బస్తాండ్ బ్లాక్ మార్కెట్‌లో రూ.400కు అమ్ముకుంటూ సొమ్ములు చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మాజీ ఎంఎల్‌సి కోడూరి శివరామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు వెంపాటి సురేష్ కుమార్, కంటమణి రమేష్ బాబు, ఎంపిపి మట్టా వీరాస్వామి, ఉప్పులూరి సూరిబాబు, సుంకర సత్యనారాయణ, కొమిరెడ్డి పరశురామారావు, తోట రామకృష్ణ, ఏలూరి విజయలక్ష్మి, తోట నారాయణ, పరిమి సోమరాజు, చిట్టూరి అన్నవరం, దేవన సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది చురుగ్గా పని చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వార్డు సచివాలయ సిబ్బంది సమర్థవంతంగా పని చేసి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ సూచించారు. శనివారం బొగ్గులదిబ్బలోని 42వ వార్డు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. వారి దైనందిన విధులు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పురమిత్ర యాప్ ద్వారా ప్రజలకు సేవలను మరింత విస్తృతం చేయాలని ఈ సందర్భంగా అదనపు కమిషనర్ సూచించారు. నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణను అందించి ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌశలం సర్వేలో ఎక్కువ మంది నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం నిర్ణీత గడువులోగా జరగాలని.. సచివాలయానికి వచ్చే సమస్యలు మరలా తిరిగి పునరావృతం కాకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి -కొవ్వూరు



చెక్కు అందజేస్తున్న పెండ్యాల అచ్చిబాబు

ఆపత్కాలంలో ఉన్న వారిని ఆదుకునేందుకు సిఎం సహాయనిధి ఉపకరిస్తుందని ఆంధ్ర సుగర్స్ జెఎండి, టిడిపి నేత పెండ్యాల అచ్చిబాబు పేర్కొన్నారు. ఆరుగురికి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందిన చెక్కులను శనివారం ఆయన అందజేశారు. దొమ్మేరు గ్రామానికి చెందిన సత్యనారాయణ మూర్తి రూ.25 వేలు, కోడి హరిబాబుకు రూ.83,972, కొయ్యలమూడి వెంకట రామారావుకు రూ.50,205 రాయి లక్ష్మికి రూ.40 వేలు, నందిన గోపికి రూ.55,786, నీరుకొండ లక్ష్మికి రూ.18 వేల చెక్కులను ఆయన అందజేశారు. మాజీ జెడ్‌పిటిసి గారపాటి శ్రీదేవి, కెవికె.రంగారావు, సొసైటీ అధ్యక్షుడు జి.వెంకటకృష్ణ రామారావు పాల్గొన్నారు.

రైతులు జలవనరుల గణన చేసుకోవాలి

ప్రజాశక్తి-గోపాలపురం

చిన్న తరహా నీటి వనరులు, జలాశయముల గణనను రైతులందరూ ఉపయోగించుకోవాలని ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు సూచించారు. రైతులు అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి పొలాలలో ఉన్న బోర్లను నమోదు చేసుకొని సర్వే నెంబరు మరియు బోరు వేసేందుకు ఖర్చు, యంత్రాలను బిగించడానికి ఖర్చు, ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగు చేసిన విస్తీర్ణాలు నీటిని తోడేందుకు ఉపయోగించే సాధనాలు, హార్స్ పవర్, యజమాని స్త్రీ నా పురుషుడా, వీరి సామాజిక హోదా, ఎన్ని గంటలు నీటిని సీజన్లలో వాడుతున్నారు, బోర్ పని చేస్తోందా లేదా అంటూ సాగే ప్రశ్నావళికి రైతులు సమాధానం ఇవ్వాల్సి ఉందని జోడాల అన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ రణభేరి జాతా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజమమేంద్రవరం

ప్రభుత్వ విద్యారంగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 నుంచి 19 వరకు యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాతా పోస్టర్‌ను యుటిఎఫ్ జిల్లా కమిటీ శనివారం ఆవిష్కరించింది. రాజమండ్రి యుటిఎఫ్ హోమ్‌లో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోస్టర్‌ను విడుదల చేస్తూ వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు ప్రాంతాల నుంచి రణభేరి జాతాలు మొదలవుతాయని, ఐదు రోజుల పాటు అన్ని ప్రాంతాల్లో జాతాలు పర్యటిస్తాయని తెలిపారు. ప్రభుత్వ విద్యా విధానాలు, విద్యా వ్యవస్థను అధోగతి పాలు చేస్తున్నాయని, ప్రభుత్వ విధానాలతో రోజు రోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందని వారు పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం 15 నెలలు కావస్తున్నా వాటి ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు ఎం.విజయ గౌరీ, జిల్లా కార్యదర్శులు రవిబాబు, దయానిధి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్ రావు, జిల్లా కార్యవర్గం శ్రీనుబాబు, శ్రీనివాసరావు, విజయ్ బాబు, పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎఒ సూర్య రమేష్

రైతులు నానో ఎరువులు వాడాలి

ప్రజాశక్తి-కడియం

కొత్తరకం ఎరువులైన నానో యూరియా, నానో డిఎపిలను రైతులు వాడాలని మండల వ్యవసాయ అధికారి కె.సూర్య రమేష్ అన్నారు. శనివారం కడియం సొసైటీలో నిర్వహించిన నానో యూరియా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నానో ఎరువుల వాడకం వల్ల పైపాటుగా వేసే ఎరువులు తగ్గించవచ్చని, వరి పొలాలు కోతకు వచ్చినప్పుడు పడిపోకుండా దఢంగా ఉంటాయని తెలిపారు. పంట నాణ్యత కూడా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని పాల్గొన్నారు.

11న పెరవలి మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-పెరవలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపిపి కె.సీతారాం ప్రసాద్ ఎంపిడిఒ కె.ఉమా రాజ్యలక్ష్మి పద్మజ తెలిపారు. సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు విధిగా హాజరవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.

వరద గోదావరి..



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి వరదలు నదీ పరివాహక ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలతో పాటు జిల్లాలోనూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి క్రమ క్రమంగా పెరుగుతోంది. అయితే గడిచిన పది రోజులలో తగ్గుతూ.. పెరుగుతూ దోబూచులాడింది. గడిచిన వారంలో రెండు దఫాలు మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలలోని లంక గ్రామాల్లో నివసించే ప్రజలు బిక్కు బిక్కుమంటూ జీవనం సాగించారు. మరోవైపు వారాంతంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు గోదావరి వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకోవటంతో ఇబ్బందులు తలెత్తాయి. పరివాహక ప్రాంతాల్లో పోలీసు యంత్రాగానికి పెద్ద సవాలుగా మారింది. అయితే ఎటువంటి అవాంతరాలు లేకుండా కార్యక్రమాలు ముగియటంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

ఉపాధి కూలీలకు వేతన వెతలు

ఉపాధి కూలీలు వేతన వెతలతో ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు నిలిచిపోవటమే ఈ దుస్థితికి కారణం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్న విషయం విధితమే. సంస్కరణల పేరుతో అనేక మార్పులు తీసుకొచ్చింది. రెండేళ్ల క్రితం నూతన సాఫ్ట్‌వేర్ అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ అంటూ సాకు చెప్పింది. దీనికి తోడుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నాయి. మరోవైపు ఉపాధి చట్టానికి తూట్లు పొడిచి నెలల తరబడి కూలీలకు బకాయిలు పెట్టడం పరిపాటిగా మారింది. తక్షణమే ఉపాధి బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఫీవర్ ఫియర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభించటంతో ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పల్లెలు, పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. దీంతో దోమల వృద్ధి గణనీయంగా పెరిగింది. ఫలితంగా డెంగీతో పాటు ఇతర జ్వరాల విజృంభణ ఒక్కసారిగా పెరిగింది. ఇటువంటి పరిస్థితులను అధిగమించేందుకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు నగరపాలికలు, పంచాయతీలు కలిసి రావాల్సి ఉంది. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. అదేవిధంగా పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో వసతులు, సౌకర్యాలు మెరుగుపర్చి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది.

యూరియా కోసం రైతుల వెతలు

యూరియా కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నప్పటికీ అధికార యంత్రాంగ భిన్నమైన ప్రకటనలు చేయటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ అధికార పార్టీ నేతలు చేస్తున్న వాఖ్యలు వారి చిత్తశుద్ధిని దర్పణం పడుతుంది. మరోవైపు యూరియా కొరత లేదంటూ అధికార యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా నిల్వలపై బులిటెన్ విడుదల చేస్తోంది. మరోవైపు చేపల చెరువులకు లేదా పరిశ్రమలకు తరలిపోయిందా అనే విషయమై పరిశీలన పెరిగింది. మరోవైపు నానో ఎరువులు వినియోగించాలంటూ వ్యవసాయ శాఖ అధికారులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ రకమైన ఎరువుల వినియోగంపై రైతుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించాలని రైతులు, రైతు సంఘాలు కోరుతున్నాయి.



అంగీకార పత్రాన్ని అందజేస్తున్నారు హెచ్‌ఎం

పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-గోకవరం

సంజీవయ్య నగర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం కె.బుల్లబ్బాయి ఆధ్వర్యంలో శనివారం ఆప్తాలమిక్ ఆఫీసర్ సిహెచ్.ఆనందరావు 220 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో 14 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించారు. వీరందరికీ త్వరలో కళ్లజోళ్ల పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమం మండలంలోని ఇతర స్కూల్స్‌లోనూ నిర్వహించారు. వారికి కూడా కళ్లజోళ్ల పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో నేత్రదానం గురించి ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం నేత్రదానానికి సంసిద్ధత తెలిపి అంగీరపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్, వైద్య ఆరోగ్య సిబ్బంది ఎమ్‌పిహెచ్‌ఎ జి.పవన్, ఎమ్‌ఎల్‌హెచ్. పి.మోనిక, ఎఎన్‌ఎంలు బేబీ, బాపనమ్మ, ఆశాలు నాగమణి, రాజేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రాంబాబుకు చంటిబాబు పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన వైసిపి మండలం అధ్యక్షులు పాటి రాంబాబును మాజీ ఎంఎల్‌ఎ జ్యోగుల చంటిబాబు శనివారం పరామర్శించారు. రాంబాబు ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఆయన ఇంటికి వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఇంటి పన్నుల బకాయిలపై రాయితీ

ప్రజాశక్తి చాగల్లు

మండలంలో గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నులు చెల్లింపును డిజిటలైజ్ చేసినట్టు డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రవణ్ కుమార్ తెలిపారు. మండలంలోని గృహ యజమానులు వారి పాత బకాయిలను దూర ప్రాంతాల్లో ఉన్నా స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ https://swarnapanchayat.apcfss.inలో లాగిన్ అయి, పే యువర్ హౌస్ టాక్స్‌ను క్లిక్ చేయడం ద్వారా చెల్లిచవచ్చని తెలిపారు. జిల్లా, మండలం, గ్రామపంచాయతీ అసెస్‌మెంట్ నెంబరు లేదా డోర్ నెంబర్ నమోదు చేయడం ద్వారా చెల్లించవచ్చన్నారు. అనంతరం కట్టిన సొమ్ముకు ఆన్‌లైన్ ద్వారా రసీదు కూడా పొందవచ్చు. సెప్టెంబర్ నెలాఖరు వరకు ఉన్న పాత బకాయిలు వడ్డీ లేకుండా సెక్రెటరీకి చెల్లించవచ్చని తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహశీల్దారు

రేషన్ వినియోగదారులకు అందించాల్సిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ త్వరిత గతిన పూర్తి చేయాలని తహశీల్దారు లక్ష్మీ లావణ్య అన్నారు. స్మార్ట్ కార్డులు పంపిణీ విషయంపై తహశీల్దారు కార్యాలయంలో శనివారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ వినియోగదారులకు కార్డులు అందించే కార్యక్రమంలో ఉద్యోగులు, రేషన్ డీలర్లు సహకరించుకోవాలని సూచించారు. మండలంలో 16,674 స్మార్ట్ కార్డులు అందించాల్సి ఉండగా ఇప్పటివరకు 11,671 కార్డులు అందజేసినట్టు తెలిపారు.

నేరాలు ఘోరాలు

కొబ్బరిచెట్టు పైనుంచి పడి వార్డు మెంబర్ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కొబ్బరిబొండం తీసేందుకు కొబ్బరి చెట్టు ఎక్కి, కాలు జారీ పడిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్న కొత్తలంక గ్రామ పంచాయతీ రెండో వార్డు మెంబర్ కముజు వీర వెంకట సత్యనారాయణ అలియాస్ సూరిబాబు(48) శనివారం ఉదయం ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరి బొండం తీస్తుండగా, కాలుజారి పడిపోవడంతో అక్కకి అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శ్రీ లక్ష్మి, కుమార్తెతో పాటు అతడిపైనే ఆధారపడిన వృద్ధ తల్లిదండ్రులు సత్య నారాయణ, సత్యవతి ఉన్నారు. దీనిపై ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదుచేసి శవ పంచనామ నిమిత్తం మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేపట్టారు.

హిజ్రాలపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వినాయకుని నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా శనివారం వెలిచేరు గ్రామంలో నిర్వహించిన ఊరేగింపులో వినాయక విగ్రహ కమిటీ సభ్యులు హిజ్రాలతో అశ్లీల నృత్యాలు చేయిస్తున్నారు. ఈ సమయంలో ఎస్ఐ ఎస్.రాము దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్లీల నృత్యాలు చేస్తున్న హిజ్రాలపైనా, కమిటీ సభ్యులు పైనా కేసు నమోదు చేశారు. అలాగే వినాయక నిమజ్జనం ఊరేగింపుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా డిజె సౌండ్, అశ్లీల నృత్యాలు వంటివి పాల్పడితే కేసు నమోదు చేస్తామన్నారు.



పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

నిమజ్జనానికి వెళుతున్న వారిపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో వినాయక నిమజ్జనం చేయడానికి వెళుతున్న వారిపై సొసైటీ అధ్యక్షుడు సానిపిని వెంకట రామారావు, ఆయన అనుచరులు దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. దీంతో బాధితులు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. నిమజ్జనానికి వెళుతుండగా కారు వేగంగా నడుపుతున్నావంటూ వరదా దుర్గా ప్రసాద్‌ను రామారావు చెంపమీద కొట్టడంతో వివాదం చెలరేగింది. అక్కడే ఉన్న రామారావు వర్గీయులు చినకొండేపూడి గ్రామానికి చెందిన వారివపై రాళ్ళు, కర్రలతో దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. వివాదం ముదరడంతో పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ సందర్భంలో చినకొండేపూడి గ్రామానికి చెందిన చిట్టాల దేవిశ్రీ ప్రసాద్‌కు గాయాలు కావడంతో వారంతా మునికూడలి నుండి సీతానగరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. సిఐ సత్య కిషోర్, ఎస్ఐ రామ్ కుమార్ బాధితులను అంబులెన్స్ లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామనిసిఐ సత్య కిషోర్ తెలిపారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడి శ్రీరామకృష్ణ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద మండల వ్యవసాయాధికారి గౌరీదేవి ఆధ్వర్యంలో శనివారం రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్ కాండ్రు శేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయాధికారి గౌరీదేవి మాట్లాడుతూ, నానో యూరియా పంటలకు పోషకాలను సమర్థవంతంగా అందిస్తుందని, దీనివల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందవచ్చని వివరించారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన కార్పొరేషన్ డైరెక్టర్లు

ప్రజాశక్తి-నిడదవోలు

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నామినేటెడ్ పోస్టులకు నియమితులైన పలువురు డైరెక్టర్లకు మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. శనివారం నిడదవోలు క్యాంప్ ఆఫీస్‌లో మంత్రి దుర్గేష్‌ను ఎపి నాటక అకాడమీ డైరెక్టర్ వెలగన దుర్గ అనంతలక్ష్మి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ముంతాజ్ బేగం, అగ్రికల్చరల్ మిషన్ డైరెక్టర్ కోరశిఖ చంద్రమౌళి కలిశారు. టీడీపీలో క్రియా శీలకంగా ఉండి కూటమి విజయానికి దోహదపడి పదవులు వరించిన వారిని మంత్రి దుర్గేష్ అభినందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మంత్రి దుర్గేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, టిడిపి సెక్రటరీ తిరుపతి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ప్రమాణం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పాలంగిలో శనివారం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. పాలంగి సర్పంచ్ బొక్కా శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. సంఘం అధ్యక్షునిగా మంకు దుర్గారావు, ఉపాధ్యక్షునిగా సున్నం దుర్గారావు, గన్నవరపు శ్రీవీరాచార్యులు కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా వసంతవాడ మణికుమార్, కోశాధికారి మేడూరి మధు శేఖర్, ఉప కోశాధికారి సున్నం జగదీష్, ప్రధాన సలహాదారులు మేడూరు జానకి రామయ్య, గోకవరపు ప్రసాద్ రావు, ఉప సలహాదారుడు కోరుమల్లి శ్రీరామారావుతోపాటు 13 మంది ప్రధాన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈడుపుగంటి ఉదయభాను, ఎంపిడిఒ ఎ.శ్రీనివాసరావు, మందరపు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను పలుచోట్ల శనివారం ఘనంగా సన్మానించారు. వీరిలో కొందరు ఇటీవల ఉత్తమ పురస్కారాలు అందుకున్న వారు ఉన్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

నిడదవోలులో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 12 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రోటరీ గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్, నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, గుంటుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన ఎ.మాధవి గంగాభవాని, జి.ముత్తయ్య, వి.ఏడుకొండలు, ఎండి.తహసీనిసుల్తానా, బి.నిర్మల, బి.వెంకటేశ్వరరావు, గమిని విజయేశ్వరి, పి.శ్రీప్రద, ఐవి.రమణ, ఎం.శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, ఎన్.అరుణ రాజేశ్వరి, ఫిలిప్‌ను ఉత్తమ ఉపాధ్యాయులగా గుర్తించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, ట్రెజరర్ గుంటుపల్లి సత్యసాయి పాల్గొన్నారు.

గోపాలపురం రేగులకుంట హైస్కూల్ హెచ్‌ఎం కూరం నారాయణరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, ఉపాధ్యాయులు యు.వెంకట రమణ, కె.పెంటారావు, కె.దుర్గారావు, కె.పోచారావు, బి.ప్రకాశరావు, జి.ఉమ, కె.రమేష్ ఆయనను ఘనంగా సన్మానించారు.

చాగల్లు నెలటూరు సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో అపుస్మా ఆధ్వర్యంలో శనివారం గురుపూజోత్సవంలో కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఉత్తమ గురువులను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఉపాధ్యాయుడు తమ విద్యార్థులను అత్యుత్తమ విద్యను అందించడంతోపాటు ఉత్తమ విద్యావంతులుగా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల అధినేత ఎన్.తిరుమలరావు, అపుస్మా నాయకులు బుల్లబ్బాయి చౌదరి, వివి.అనిష్, టిడిపి సీనియర్ నాయకులు, ఎ.హరిబాబు పలు పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

తాళ్లపూడి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న పలువురు ఉపాధ్యాయులు, ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న శంకరం, గంగరాజు, శ్రీనివాస్, బదిలీ అయిన రఘువీర శాస్త్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజారత్నం, కనకదుర్గ, జివికె.రాజు, కృష్ణ, నాని, మూర్తి, జయబాబు పాల్గొన్నారు. శ్రీవిజేత హైస్కూల్ హెచ్‌ఎం డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్ దంపతులను పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



గోపాలపురంలో నారాయణరావును సత్కరిస్తున్న టీచర్స్

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-గోపాలపురం

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి సంఘం డెయిరీ నిరంతరం కృషి చేస్తుందని సంఘం డెయిరీ తూర్పు, పశ్చిమ జిల్లాల జోనల్ మేనేజర్ డాక్టర్ ఏలేటి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలపురంలో సంఘం డెయిరీలో 36 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1.35 లక్షల బోనస్ అందజేశామని తెలిపారు. సంగం డెయిరీ ఎల్లప్పుడు పాల ఉత్పత్తిదారులకు అభివృద్ధికి అండగా ఉంటుందని తెలిపారు. రైతులకు ప్రతి ఏట క్రమం తప్పకుండా బోనసులు చెల్లిస్తున్నామని తెలిపారు. జోనల్ మేనేజర్ డాక్టర్ సాగర్, సంగం డెయిరీ బిఎంసి ఇన్‌ఛార్జి పోతవరం బి.కోటేశ్వరరావు, సూపర్‌వైజర్లు ఎం.సత్యనారాయణ, జె.రమేష్, జ్యేష్ఠ పద్మావతి పాల్గొన్నారు.

కాల్వగట్లపై చెత్త : తాగు, సాగు నీరు కలుషితం

ప్రజాశక్తి-పెరవలి

మండలం పలు గ్రామాల్లో జాతీయ రహదారి ఆర్ అండ్ బి పంచాయతీ రోడ్ల పక్కన కొంతకాలంగా గ్రామాల్లో సేకరించిన తడి పొడి చెత్త తీసుకుని వచ్చి వేస్తున్నారు దీని వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం సమయంలో తగలబెట్టిన చెత్తాచెదారం పొగ రోడ్లపై వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాపవరం, తీపర్రు గ్రామ సచివాలయాల్లో సేకరించిన తడి పొడి చెత్త తీసుకుని వచ్చి నిడదవోలు-నరసాపురం ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డు మెయిన్ కెనాల్ పక్కన వేయటంతో అంటించిన బూడిద చెత్తాచెదారం కాలువలో కలిసి నీరు కలుషితం అవుతోంది. జాతీయ రహదారి పక్కన పెరవలి, అన్నవరప్పాడులో సేకరించిన చెత్త అంటించడంతో వాటి నుంచి వచ్చే పొగ, ధూళితో ప్రయాణికులు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నరు. గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించినా నేటికీ అవి నిరుపయంగా ఉన్నాయి. ప్రస్తుతం తడి పొడి చెత్త మెయిన్ కెనాల్, పిల్ల కాలువలు మురుగు కాలువలు పంచాయతీ ఆర్ అండ్ బి రోడ్ల పక్కన చెత్త గుట్టలుగా వేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాదారులతో బారిన పడడంతో చెత్త రోడ్ల పక్కన వేయటంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయి.




కాపవరం మెయిన్ రోడ్ నర్సాపురం కాలువ పక్కన వేసిన చెత్త

నల్లగొండలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

ప్రజాశక్తి - సీతానగరం

నల్లగొండలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులూ లేకుండా భారీగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి, రాత్రికి రాత్రే అక్రమంగా రవాణా చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం కోల్పోతోందని అంటున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో అక్రమార్కులు గ్రావెల్‌ను తవ్వకాలు చేపడుతున్నారు. ఈ అక్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, రవాణా సమయంలో రోడ్లు పాడవుతున్నాయని వారు చెబుతున్నారు. ఈ అక్రమాలపై స్థానిక మైనింగ్, రెవెన్యూ, మరియు పర్యావరణ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా, ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా చేసినవారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన అక్రమార్కులచే అపరాధ పన్ను కట్టించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



నల్లగొండలో అక్రమంగా తవ్వేసిన గ్రావెల్ ప్రాంతం

బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎపి బిసి కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి అన్నారు. శనివారం ఆమె నగరంలో పర్యటించారు. జగన్నాథపురం 18 వ డివిజన్‌లో నిర్వహిస్తున్న మహిళల ఉచిత కుట్టు మిషన్ శిబిరాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. బిసి కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వెనకబడిన వర్గాల మహిళల ఆర్థిక అభివృద్ధికి కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు తెలిపారు. బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను అందిస్తామని అన్నారు. ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బిసి కార్పొరేషన్‌ను నిర్వీరం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్లో బిసి వర్గాలకు అధిక నిధులు కేటాయించి, బిసి కులాలను అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. మల్లిపూడి వీరు, నాయకులు బొడ్డు శివాజీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, మందాల గంగ సూర్యనారాయణ, కోపనాతి నాగ కుమారి, తుమ్మల సునీత, రిక్కా లక్ష్మి, తదితరులు పాల్గున్నారు.